క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొరిటిపాడు: రోడ్డు విస్తరణ పనులు, లైన్ షిఫ్టింగ్ పనుల్లో భాగంగా విద్యుత్ సరఫరా శనివారం నిలిపివేయనున్నట్లు గుంటూరు-2 డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.గురవయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు. పట్టాభిపురం డీఆర్ఎం కార్యాలయం రోడ్డు, ఎన్‌సీసీ అపార్ట్‌మెంట్, తదితర ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

మర్యాద పూర్వక కలయిక



పట్నంబజారు: వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ సీఈసీ సభ్యుడిగా నియమితులైన మందపాటి శేషగిరిరావు గురువారం ఎమ్మెల్సీ, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. చంద్రమౌళినగర్‌లోని ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. సీఈసీ సభ్యుడిగా నియమితులైన మందపాటిని దుశ్శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు గులాం రసూల్, పరిశపోగు శ్రీనివాసరావు, హైదర్ ఆలీ, సమీవుల్లా పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బంది వినతుల పరిష్కారానికి కృషి

నగరంపాలెం: జిల్లాలోని పోలీస్ సిబ్బంది వినతుల పరిష్కారానికై అధిక ప్రాధాన్యం ఇస్తామని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. నగరంపాలెంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం పోలీస్ స్టాఫ్ గ్రీవెన్స్ డే నిర్వహించారు. పోలీస్ సిబ్బంది నుంచి వినతులు స్వీకరించారు. ఐదుగురు పోలీస్ సిబ్బంది బదిలీలు, సర్వీసు సంబంధిత సమస్యల పరిష్కారానికి వినతి పత్రాలు అందించారు. వాటికి సానుకూలంగా స్పందించి, సంబంధిత అధికారులు సదరు వినతులను పరిష్కరించాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు.

రేపు సర్వేపల్లి ప్రతిభా పురస్కారాలు ప్రదానం

గుంటూరు ఎడ్యుకేషన్: కేవీఆర్ అండ్ జయలక్ష్మి ఎడ్యుకేషనల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఈనెల 5న అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేస్తున్నట్లు మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మార్కెట్ సెంటర్లోని శ్రీవేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఆదివారం మధ్యాహ్నం 2.00 గంటలకు నిర్వహించనున్న కార్యక్రమంలో 50 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలను ప్రదానం చేస్తామని చెప్పారు.

ఆటో డ్రైవర్లు యూనిఫాంతో హాజరు కావాలి

నెహ్రూనగర్: రాష్ట్ర ప్రభుత్వం ఆటోవాలాలకు అండగా ఉండేందుకు ప్రతిష్టాత్మకంగా శనివారం చేపట్టిన కార్యక్రమానికి డ్రైవర్లు యూనిఫాంతో హాజరు కావాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్బన్ పరిధిలో రెవెన్యూ కళ్యాణ మండపంలో శనివారం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఉదయం 9 గంటలకు హాజరు కావాలని కోరారు. ఆటో డ్రైవర్ సేవలో పథకం ద్వారా డ్రైవర్లుకు ఏడాదికి ఒక్కసారి రూ.15 వేలు ఆర్థిక సహాయం అందించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు.

డీడీగా పాల్‌సుధాకర్ బాధ్యతల స్వీకరణ

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రాంతీయ, వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు (ఆర్డీ) కార్యాలయం డెప్యూటీ డైరెక్టర్ బండి పాల్ సుధాకర్ శుక్రవారం విధుల్లో చేరారు. గుంటూరు వైద్య కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ)గా విధులు నిర్వహిస్తున్న పాల్‌సుధాకర్‌కు ఇటీవల డెప్యూటీ డైరెక్టర్‌గా ప్రమోషన్ వచ్చింది. శుక్రవారం వైద్య కళాశాల నుంచి రిలీవ్ అయి ఆర్డీ కార్యాలయం డీడీగా బాధ్యతలు స్వీకరించారు. వైద్య కళాశాల ఏడీ పోస్టు ఖాళీ అవడంతో కాలేజీలు అడ్మినిస్ట్రేటీవ్ ఆఫీసర్‌గా (ఏఓ) పనిచేస్తున్న ఎం.యూ.బీ సరోజ్ కుమార్‌ను ఇన్‌చార్జి ఏడీగా నియమిస్తూ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.వి.సుందరాచారి శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు.

పండుగల విశిష్టతపై ప్రవచనం

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై శుక్రవారం ప్రముఖ జ్యోతిష్య పండితుడు నిష్టల సుబ్రహ్మణ్యశాస్త్రి వచ్చే పండుగల విశిష్టతపై ప్రవచనం చేశారు. తొలుత ఆలయ పాలకమండలి వారు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు.

రాజరాజేశ్వరీదేవిగా భ్రమరాంబ అమ్మవారు

గుంటూరు ఎడ్యుకేషన్: మల్లికార్జునపేటలోని గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామివారి దేవస్థానంలో విజయదశమి సందర్భంగా అమ్మవారు రాజరాజేశ్వరీదేవిగా దర్శనమిచ్చారు. సాయంత్రం శమీ పూజ, స్వామి, అమ్మవార్ల నగరోత్సవం నిర్వహించారు.

గాంధీ మార్గం అనుసరణీయం



హిమని సెంటర్‌లోని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్, మేయర్

నెహ్రూనగర్: మహాత్మా గాంధీ మార్గం అనుసరణీయమని జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని గురువారం హిమని సెంటర్‌లోని మహాత్మ గాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గాంధీజీ దేశం కోసం చేసిన సేవలను, స్వాతంత్ర పోరాటంలో చేసిన త్యాగాలను స్మరించుకోవలసిన అవసరం ఎంతైన ఉందన్నారు. సత్యం, సేవాభావం అనే గొప్ప అంశాలను ప్రపంచానికి అందించిన మహనీయుడు గాంధీజీ అని కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన స్వచ్ఛ అవార్డులలో జిల్లాకు రాష్ట్రస్థాయిలో 5 అవార్డులు, జిల్లా స్థాయిలో 48 అవార్డులు రావడం గర్వకారణం అని అన్నారు. నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర మాట్లాడుతూ సుపరిపాలన ద్వారా గ్రామ స్వరాజ్య స్థాపనే లక్ష్యంగా గాంధీ కలలు కన్నారని గుర్తుచేశారు. గాంధీజీ ఆశయ సాధనలో ప్రతి ఒక్కరూ దేశం కోసం పాటుపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హజ్ కమిటీ చైర్మన్ హాసన్ బాషా, నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసు, జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజావలి పాల్గొన్నారు.

గ్రీన్ గ్రేస్ ఆవరణలో గాంధీ జయంతి

కొరిటిపాడు(గుంటూరు వెస్ట్): పట్టాభిపురంలోని గ్రీన్ గ్రేస్ ప్రాజెక్టు ఆవరణలో మహాత్మాగాంధీ, దివంగత ప్రధానమంత్రి లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి గురువారం నిర్వహించారు. తొలుత వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బజరంగ్ అర్బన్ సీఈఓ అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ మహాత్మాగాంధీ దేశ స్వాతంత్ర్య సాధనకు ఎన్నో ఉద్యమాలను అహింసా మార్గంలో చేశారని, ఆయన స్ఫూర్తితో ఎంతో మంది స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారని తెలిపారు. కార్యక్రమంలో గ్రీన్ గ్రేస్ యాజమాన్యం సిద్దినేని శ్రీనివాసరావు, ఎస్.సమీర్ నందన్, జి.సుబ్బారావు, ప్రాజెక్టు మేనేజర్ దుర్గై పాల్గొన్నారు.

గుంటూరు ఎడ్యుకేషన్:

దేశానికి స్వాతంత్ర్యాన్ని సాధించిన మహాత్మాగాంధీ, ప్రధానిగా స్వచ్ఛమైన పాలన అందించిన లాల్‌బహదూర్ శాస్త్రి చిరస్మరణీయులని సెయింట్ లారెల్స్ ఇంగ్లిష్ మీడియం పాఠశాల కరస్పాండెంట్ మేకల రవీంద్రబాబు పేర్కొన్నారు. ఆర్టీసీ కాలనీలోని పాఠశాలలో గురువారం జాతిపిత మహాత్మాగాంధీ, మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు సాయి శ్రీకర్, శేష కుమారి పాల్గొన్నారు.



గాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు ముప్పాళ్ల



అవగాహన కార్యాలయంలో మహాత్మా గాంధీ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

సీపీఐ ఆధ్వర్యంలో నివాళి

లక్ష్మీపురం: సహాయ నిరాకరణ ఉద్యమాన్ని ఆయుధంగా చేసుకొని బ్రిటీష్ సామ్రాజ్యవాదాన్ని గడగడలాడించిన యోధుడు మహాత్మా గాంధీ అని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు కొనియాడారు. సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా గురువారం స్థానిక హిమనీ సెంటర్లో ఉన్న గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు జంగాల అజయ్ కుమార్, కోటా మాల్యాద్రి, అకిటి అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

మహాత్మాగాంధీ చిరస్మరణీయుడు

గుంటూరు ఎడ్యుకేషన్: సత్యం, అహింస ఆయుధాలుగా చేసుకుని దేశ స్వాతంత్ర్య సంగ్రామాన్ని ముందుకు నడిపించిన మహాత్మాగాంధీ బ్రిటీషువారితో పోరాటం చేశారని కన్న విద్యాసంస్థల డైరెక్టర్ కన్న మాస్టారు పేర్కొన్నారు. రైలుపేటలోని కన్న ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో గురువారం జాతిపిత మహాత్మాగాంధీ, దివంగత ప్రధాని లాల్ బహదూర్‌శాస్త్రి జయంతి సందర్భంగా వారి చిత్రపటాలను పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా కన్న మాస్టారు మాట్లాడుతూ లాల్ బహదూర్ శాస్త్రి నిస్వార్థంగా దేశానికి సేవలు అందించారని, అటువంటి మహనీయులను స్మరించుకుని, జీవితంలో సన్మార్గంలో పయనించాలని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు మహాత్మాగాంధీ వేషధారణలో అలరించారు.

అవగాహన ఆధ్వర్యంలో..

లక్ష్మీపురం: గుంటూరు అరండల్‌పేటలోని అవగాహన సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం మహాత్మా గాంధీ జయంతి ఘనంగా నిర్వహించారు. తొలుత గాంధీజీ చిత్రపటానికి పూల మాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ ఆయన సేవలు చిరస్మరణీయని చెప్పారు. విశ్లేషకులు ఆర్.వి సింగరయ్య మాట్లాడుతూ మతాన్ని దేవుణ్ణి సరిగ్గా అర్థం చేసుకున్న ప్రజా నేత జాతిపిత గాంధీ అన్నారు. ఆయన దృష్టిలో సత్యమే దైవం, భగవంతుడి సామ్రాజ్యమే రామరాజ్యం అహింసే దాని సాధనకు పరమాయుధం అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఆర్.రామచంద్రరావు, ప్రొఫెసర్ రత్నారావు, ఉపాధ్యాయ నేత తదితరులు గాంధీకి నివాళులర్పించారు.

వైభవంగా ముగిసిన శరన్నవరాత్రులు



బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో రాజరాజేశ్వరిదేవి అలంకారం



అరండల్‌పేట శ్రీలక్ష్మీనారాయణస్వామి ఆలయంలో రాజరాజేశ్వరిదేవి అలంకారం



రెడ్లబజార్ శ్రీకనకదుర్గమ్మ అమ్మవారి దేవస్థానంలో కొలనులో అమ్మవారి తెప్పోత్సవం

నగరంపాలెం: నగరంలోని దేవాలయాల్లో గత 11 రోజులు వైభవంగా నిర్వహిస్తోన్న శ్రీ దేవీశరన్నవరాత్రులు ముగిశాయి. పది రోజులుగా పలు అలంకారాల్లో దర్శనమిచ్చిన అమ్మవారు గురువారం శ్రీరాజ రాజేశ్వరిదేవీగా భక్తులకు దర్శనమిచ్చారు. శుక్రవారం కొత్తపేట, చుట్టుగుంట, పాతగుంటూరు, బ్రాడీపేట, కోబాల్డుపేట, కొరిటిపాడు, జూట్‌మిల్ ఏరియాల్లో అన్నప్రసాద వితరణ చేశారు. అనంతరం సువాసినులతో కుంకుమార్చనలు, సాయంత్రం దంపతులతో అమ్మవారి సహస్రనామ పూజలు జరిగాయి. లోకకల్యాణార్థం చండీ హోమం మహా పూర్ణాహుతి చేపట్టారు. రెడ్లబజార్ శ్రీకనకదుర్గమ్మ అమ్మవారి దేవస్థానం ఎదుట గురువారం రాత్రి భారీగా కృతిమ కొలను నెలకొల్పారు. అమ్మవారిని కృతిమ కొలనులో జలవిహారం చేయించారు.

భక్తి ప్రపత్తులతో చండీ హోమం



నగరంపాలెం: స్థానిక పండరీపురం ఒకటో వీధిలోని శ్రీకోదండరామ మందిరంలో శ్రీ దేవీ శరన్నవరాత్రులు ముగింపు సందర్భంగా శుక్రవారం చండీ హోమం నిర్వహించారు. భక్తి ప్రపత్తులతో జరగ్గా, పలువురు దంపతులు హోమ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కార్యక్రమాలను ఆలయ అధ్యక్షులు బ్రహ్మాండం గంగాధర శర్మ, కార్యదర్శి గొల్లపూడి రామకృష్ణారావు పర్యవేక్షించారు.

గాయత్రి హోమం చేస్తే కుటుంబాల్లో శాంతి



నగరంపాలెం: ఇంటింటా నిత్యం గాయత్రి హోమం చేయడం ద్వారా ఆయా కుటుంబాలలో శాంతితోపాటు లోక కల్యాణం పరిఢవిల్లుతుందని హఠయోగి పులివర్తి ముక్తేశ్వర వెంకట కేశవరావు విశ్వకర్మ అన్నారు. శ్రీ దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా శుక్రవారం పాతగుంటూరు శ్రీకంచి కామాక్షి, ఏకాంబరేశ్వరస్వామి వార్ల దేవస్థానం ఆవరణలోని కంచి కామాక్షమ్మ ఆలయంలో 54 మంది దంపతులతో కుటుంబ నిత్య గాయత్రి హోమాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేశవరావు విశ్వకర్మ మాట్లాడుతూ 85 ఏళ్లకు పైగా వంశపారంపరంగా తమ కుటుంబం చేస్తున్న కార్యక్రమాలకు గుంటూరు పట్టణ బ్రాహ్మణ సంఘం, దేవస్థానం పాలనాధికారి సహకారం అందిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో పులివర్తి వాణి, పులివర్తి కృపార్ధ సింధుసాయి, పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కడియాల సుబ్బారావు, కందేపు వెంకటభాస్కరరావు, డాక్టర్ కె.కొండయ్య గురూజీ, అమర్తలూరు వీరబ్రహ్మేంద్రరావు, కన్వీనర్ యలవర్తి ధర్మారావు, పూసపాటి గిరిధర్, దేవస్థానం ఈఓ సౌమ్య దంపతులు పాల్గొన్నారు.

టైలరింగ్ షాపు, బైక్‌లు దహనం చేసిన వ్యక్తి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లు, ముసుగులో ఉన్న నిందితుడు

లక్ష్మీపురం: టైలరింగ్ షాపు, రెండు ద్విచక్ర వాహనాలు దహనం చేసిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లు శుక్రవారం రాత్రి వివరాలు వెల్లడించారు. గుజ్జనగుండ్ల మూడో లైన్‌లో సెప్టెంబర్ 29వ తేదీన శ్యామలానగర్ చెందిన షేక్ మహమూద్ అనే యువకుడు ఒక టైలరింగ్ షాపు, రెండు ద్విచక్రవాహనాలు దహనం చేసిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా మహమూద్ నిందితుడిగా గుర్తించి విచారించినట్లు చెప్పారు. లావునూరి మధుసూదన్ రెడ్డి అనే వ్యక్తి మరొక వ్యక్తితో కలసి గతంలో మహమూద్ బంధువైన కరీముల్లా అనే వ్యక్తిని ఎకో పార్క్ వద్ద హత్య చేశారు. ఆ కేసులో మధుసూదన్‌రెడ్డి బెయిల్‌పై వచ్చిన తరువాత అతడి వద్దకు మహమూద్ వెళ్లి చనిపోయిన కరీముల్లా పిల్లలకు న్యాయం చేయమని కోరగా అందుకు అతడు నిరాకరించాడు. దీంతో మహమూద్ దాన్ని మనసులో పెట్టుకుని పెట్రోల్ పోసి టైలరింగ్ షాపు, ద్విచక్రవాహనాలను దహనం చేసినట్లు అంగీకరించాడు. దీంతో మహమూద్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

కోటి రూపాయలకు టోకరా

లక్ష్మీపురం: హైదరాబాద్ పోలీసులమని, ఇన్‌కం ట్యాక్స్ అధికారులమంటూ బెదిరించి కోటి రూపాయలు వసూలు చేసిన ఘటనపై గుంటూరు పట్టాభిపురం పోలీసులు శుక్రవారం రాత్రి కేసు నమోదు చేశారు. వివరాలు.. గుంటూరు ఎస్‌వీఎన్ కాలనీ ఐదో లైన్ ప్రాంతానికి చెందిన నల్లూరి వెంకటేశ్వర్లు వ్యాపారం చేస్తుంటారు. నాలుగు నెలల క్రితం ఆయన ఫేస్‌బుక్‌కు శైలజ అనే పేరుతో హాయ్ అని మెసేజ్ వచ్చింది. దీంతో వెంకటేశ్వర్లు దానికి సమాధానం ఇచ్చాడు. దీంతో వెంకటేశ్వర్లుకు కాల్ బాయ్‌గా వెళ్తే డబ్బులు వస్తాయని ఆమె చెప్పింది. అందుకు వెంకటేశ్వర్లు తాను 68 సంవత్సరాల వృద్ధుడనని తనకు మెసేజ్ గాని, వాయిస్‌కాల్ కాని చేయవద్దని చెప్పాడు. ఎంత చెప్పి ఆమె వినకుండా సుమారు పది రోజుల పాటు మెసేజ్‌లు చేయడం వాయిస్ కాల్స్ చేసి మాట్లాడం చేసింది. కొద్ది రోజుల తరువాత వెంకటేశ్వర్లుకు వేరే కొత్త నంబర్ నుంచి గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి తాము హైదరాబాద్ పోలీసులమని, మహిళలతో అసభ్యంగా చాట్ చేస్తున్నట్లు మహిళ ఫిర్యాదు చేసిందని చెప్పారు. అంతటితో ఆగకుండా తాము ఇన్‌కం ట్యాక్స్ అధికారులమని బెదిరించి వెంకటేశ్వర్లుకు ఉన్న రైస్ మిల్లులో చాలా నగదు లావాదేవీలు జరుగుతున్నాయని రైస్ మిల్లుపై త్వరలో రైడ్ చేయడానికి వస్తున్నామని భయందోళనకు గురి చేశారు. రైడ్‌కు రాకుండా ఉండాలంటే డబ్బులు ఇవ్వాలని బెదిరించారు. దీంతో వెంకటేశ్వర్లు భయపడి తన ఖాతా నుంచి ఒక కోటి రూపాయల వరకు డబ్బులు పంపించాడు. అయినా గుర్తు తెలియని నంబర్‌ల నుంచి ఫోన్‌లు వస్తున్న నేపథ్యంలో పోలీసులను శుక్రవారం ఆశ్రయించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డ్రెయిన్లపై ఆక్రమణలు తొలగింపు

నెహ్రూనగర్: రోడ్ల మీద ట్రాఫిక్ సమస్య, డ్రెయిన్లలో మురుగుపారుదలకు అడ్డుగా ఉన్న ఆక్రమణలను తొలగించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. శుక్రవారం కమిషనర్ పట్టాభిపురం మెయిన్ రోడ్, భాగ్య నగర్, తుఫాన్ నగర్, మారుతి నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వర్షం నీరు డ్రెయిన్లలో సక్రమంగా వెళ్లడానికి వీలు లేకుండా, ట్రాఫిక్‌కి అంతరాయంగా ఆక్రమణలు ఉండడానికి వీలు లేదని, ఇప్పటికే పలుమార్లు వారికి ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించుకోవాలని తెలియజేసినప్పటికి స్పందించకపోవడంతో వెంటనే పట్టణ ప్రణాళిక అధికారులు తొలగించాలని ఆదేశించారు.

అలరించిన చిన్నారుల నృత్యాలు



నగరంపాలెం: దసరా ఉత్సవాలు వైభవంగా నిర్వహించారని గ్రంథాలయ పరిషత్ రాష్ట్ర డైరెక్టర్ ఎం.పద్మజ అన్నారు. నగరంలోని శిల్పకళా వేదికలో గురువారం జరిగిన దసరా ఉత్సవాల ముగింపు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను కొనసాగించేందుకు శిల్పకళా వేదిక దోహదపడుతుందని అన్నారు. అనంతరం తెలుగు సాంస్కృతిక విభాగం చిన్నారులకు సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను ఆమె అందించారు.

దసరా సందడి





గౌతమి నగర్ బాల గణపతి అసోసియేషన్ ఆధ్వర్యంలో దసరా ఉత్సవాల్లో భాగంగా రాజరాజేశ్వరీ దేవి అలంకరణలో భారీ పూలంకరణలతో కళాకారులతో ఊరేగింపు దృశ్యాలు
–సాక్షి, గుంటూరు ఫొటోగ్రాఫర్

శంకర్ విలాస్ బ్రిడ్జి పనులు త్వరగా పూర్తి చేయాలి

కలెక్టర్‌కు విన్నవించిన బీజేపీ నేతలు



జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియాను కలిసి పూలబొకే అందజేస్తున్న బీజేపీ నేతలు

గుంటూరు మెడికల్: జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియాను బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా జిల్లా అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ప్రజా ఫిర్యాదుల విభాగాన్ని మరింత బలోపేతం చేసి, ప్రజలకు సులభంగా అందుబాటులోకి తేవాలని కలెక్టర్‌ను కోరారు. గుంటూరు నగరంలో ఉన్న శంకర్ విలాస్ బ్రిడ్జి నిర్మాణ పనులు చాలా కాలంగా నిలిచిపోయాయని, ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. బ్రిడ్జి నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసి వినియోగంలోకి తేవాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి భజరంగ్ రామకృష్ణ, వై.వి.సుబ్బారావు, చరకా కుమార్ గౌడ్ తదితరులు ఉన్నారు.

కుశలవ హ్యుండయ్ కార్ల దసరా పండుగ సంబరాలు

నగరంపాలెం: దసరా పండుగను పురస్కరించుకుని హ్యుండయ్ కార్ల భారీ డిస్కౌంట్‌లు, ప్రభుత్వ జీఎస్టీ తగ్గింపుతో ఒకేరోజు యాభై కార్లకు పైగా పంపిణీ చేసి ఒక మైలురాయిని సాధించామని కుశలవ గుంటూరు హ్యుండయ్ ప్రతినిధి ఉస్మాన్ బేగ్ శుక్రవారం తెలిపారు. ఈ పండగ సీజన్‌లో కస్టమర్ హ్యుండయ్ ఎస్‌యూవీ పోర్ట్ ఫోలియో-క్రెటా, ఎక్స టర్ ఎంక్వయిరీలు బుకింగ్‌ల రిటైల్ డెలివరీలో అసాధారణ పెరుగుదలను చూసిందని తెలిపారు. జాతీయంగా ఎస్‌యూవీలు హ్యుండయ్ విజయానికి సహకరించాయని, గత నెల్లో సంస్థ దేశీయ అమ్మకాల్లో 72.4% వృద్ధి సాధించిందని అన్నారు. వినియోగదారులకు విశ్వాసం పెరిగిందని, పండుగ ఆఫర్లు, బలమైన ఉత్పత్తి డిమాండ్ కావడంతో హ్యుండయ్ దూసుకెళ్లేందుకు సిద్ధంగా ఉందని వివరించారు.

డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్య

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని శుక్రవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడింది. నగరంపాలెం పోలీసులు తెలిపిన వివరాలు... సాయినగర్ ప్రాంతానికి చెందిన యర్రగొర్ల సోమయ్య చుట్టుగుంట సెంటర్‌లో చెరకు రసం బండి నడుతుంటాడు. ఆయనకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె. కుమార్తె శివ మౌనిక(20) డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. శుక్రవారం రాత్రి సోమయ్య మినరల్ వాటర్ క్యాన్ కోసం బయటకు వెళ్ళి, వచ్చి చూసే సరికి కుమార్తె ఉరి వేసుకుని మృతి చెందింది. నగరంపాలెం ఇన్‌చార్జి సీఐ కిషోర్, ఎస్ఐ రాంబాబు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించి కేసు నమోదు చేశారు.

పెంచిన కూలి రేట్లను అమలు చేయాలి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకుడు చిన ఆంజనేయులు

లక్ష్మీపురం: యాజమాన్యం మొండి వైఖరిని వీడకుండా పెంచిన కూలీ రెట్లను అమలు చేయకపోవడం సరి కాదని హమాలీ ఫెడరేషన్ ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు చల్లా చిన ఆంజనేయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గుంటూరు రాఘవయ్య భవన్‌లోని నగర ముఠా కార్మికుల సంఘం కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిన్నింగ్, టీఎంసీ మిల్లుల్లో పని చేస్తున్న ముఠా కార్మికులను పెంచిన కూలీ రెట్లను అమలు చేయకుండా యజమాన్య నిర్లక్ష వైఖరి అవలంబించడం సరికాదన్నారు. చర్చలు జరిపి అంగీకరించిన కూలీ రెట్లను వెంటనే అమలు చేయాలని ఆయన యజమాన్యానికి డిమాండ్ చేశారు. యూనియన్ అధ్యక్షులు జి.సురేష్ బాబు మాట్లాడుతూ టీఎంసీ యజమాన్యం యూనియన్‌తో అగ్రిమెంట్ చేసుకుని ఇస్తున్న కూలీ రెట్లను 11 శాతం పెంపుదలకు అంగీకరించడం జరిగినదని కానీ దాని అమలు చేయడంలో యజమాన్యం చాలా దారుణంగా వ్యవహరించడం సరికాదన్నారు. కార్యక్రమంలో ముఠా కార్మికుల సంఘం నాయకులు రేగుల రాఘవ, కొత్త శివారెడ్డి, బోయపాటి శ్రీకాంత్, మేనుగంటి వెంకటరావు, నవీన్, సైదా పాల్గొన్నారు.

అధికారిక సమావేశంలో ప్రైవేట్ వ్యక్తులు



సమావేశంలో ముందు వరసలో కూర్చున బిల్ కలెక్టర్ (అడ్మిన్) కింద పనిచేసే ప్రైవేట్ వ్యక్తి(రౌండ్‌లో ఉన్న వ్యక్తి)

నెహ్రూనగర్: జీఎస్టీ తగ్గింపుపై ప్రజలకు అవగాహన కల్పించే నిమిత్తం శుక్రవారం గుంటూరు నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్‌లో వార్డు సచివాలయ అడ్మిన్స్‌తో నిర్వహించిన సమావేశానికి ప్రైవేట్ వ్యక్తులు కూడా హాజరైయ్యారు. కొన్ని సచివాలయాల్లో అడ్మిన్లుగా కార్పొరేషన్ ఉద్యోగులైన బిల్‌కలెక్టర్లు వ్యవహరిస్తున్నారు. బిల్ కలెక్టర్ల కింద పనిచేసే అసిస్టెంట్స్ కూడా అధికారిక సమావేశామైన హాజరవుతున్న విషయం కార్యాలయంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. శుక్రవారం నిర్వహించిన ఈ సమావేశానికి ఇద్దరు బిల్‌కలెక్టర్ల కింద పనిచేసే అసిస్టెంట్లు హాజరయ్యారు. ఓ వ్యక్తి అదనపు కమిషనర్ ముందే కూర్చున్నప్పటికి కూడా ఎవరూ తమ ఉద్యోగి, ఎవరూ బయటి వ్యక్తో కూడా గమనించలేని పరిస్థితుల్లో కార్పొరేషన్ అధికారులు ఉన్నారంటే అతిశయోక్తి లేదు. రెవెన్యూ విభాగంలో ఆర్ఐల కింద, బిల్ కలెక్టర్ల కింద ఒకరు ఇద్దరు చొప్పున ప్రైవేట్ వ్యక్తులు పనిచేస్తున్నారని వారు ఫీల్డ్‌లో ఉద్యోగులకు సహకారులుగా ఉంటే తప్పులేదులే కాని.. ఈ విధంగా కార్యాలయంలో జరిగే సమావేశాలకు కూడా అధికారికంగా హాజరు కావడంపై తీవ్ర దుమారం రేగుతుంది.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

రేంజ్ ఐజీ సర్వశ్రేష్ట త్రిపాఠి

నగరంపాలెం: చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారి పట్ల కఠినంగా వ్యవహరించాలని గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ట త్రిపాఠి అన్నారు. కలెక్టర్ బంగ్లా రోడ్డులోని గుంటూరు రేంజ్ కార్యాలయంలో శుక్రవారం రాత్రి గుంటూరు జిల్లా ఏఎస్పీలు, డీఎస్పీలతో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి, ఇతర మారకద్రవ్యాల నిర్మూలనకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని కోరారు. మత్తు పదార్థాల క్రయ, విక్రయాలపై, రవాణా కేసుల్లో పాత, కొత్త నేరస్తులపై నిఘా ఉంచాలన్నారు. రౌడీషీటర్ల ఆగడాలను అరికట్టేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రౌడీషీటర్ల వివరాలు జియో ట్యాకింగ్ చేసి, ఎప్పటికప్పుడు వారి కదలికలను గమనించాలని ఆదేశించారు. సామాజిక మాధ్యమాలపై ప్రత్యేక దృష్టి సారించి, అసత్య, అసభ్యకర రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసేవారిని ఉపేక్షించరాదన్నారు. సమావేశంలో జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ పాల్గొన్నారు.